
సాక్షి బాపట్ల

శుక్రవారం, 6, అక్టోబర్, 2023




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో గురువారం క్వింటాలు నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,600, గరిష్ట ధర రూ.3600, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,225 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,198 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

కొండవీడు పర్యాటకాభివృద్ధికి కృషి

యడ్లపాడు: సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కొండవీడు పర్యాటక కేంద్రంలో సరికొత్త ప్రాజెక్టులను రూపొందించాలని ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (గుంటూరు) వై.శ్రీనివాసరెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక ప్రాంతం కొండవీడుకోటను గురువారం ఆయన సందర్శించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కొండవీడు–నగరవనం ద్వారా ప్రతినెలా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్షించి పలు సూచనలు చేశారు. సుమారు రూ.3 కోట్ల అంచనాతో చేయాల్సిన కొండవీడు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికల రూపకల్పనకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి రమణమ్మ, డీఆర్వో పి.నీలిమాదేవి, కొండవీడు బీట్‌ఆఫీసర్ ఎస్.పురుషోత్తమరాజు, ఏబీఓ కె.వెంకటేశ్వరరావు, కొండవీడు కోట అభివృద్ధి కన్వీనర్ కల్లి శివారెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ నంబరు బోర్డు ఏర్పాటు చేయాలి

నరసరావుపేట: రాష్ట్రం అంతటా డెకాయ్ ఆపరేషన్ జరగబోతున్న తరుణంలో ప్రతి వ్యాపార సంస్థ జీఎస్టీ నంబరు కనపడేలా ఏర్పాట్లు చేసి ప్రతి అమ్మకానికి బిల్లు ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, గాదంశెట్టి రామకృష్ణ గురువారం సూచించారు. లేనిపక్షంలో రూ.20 వేలు జరిమానా చెల్లించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వారి సభ్యులకు తెలియచేసి అప్రమత్తం చేయాలని కోరారు.

ప్రావిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారి ప్రావిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ప్రావిజనల్ మెరిట్ లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. ప్రావిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు.ఏపీ.ఇన్/ఎంహెచ్2023 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

7న మహిళా కళాశాలలో జాబ్ డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డైకిన్ సంస్థలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆపరేటర్, లైన్ సూపర్‌వైజర్లుగా 150 పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లో డిగ్రీ విద్యార్హతతోపాటు 18 నుంచి 24 ఏళ్ల వయసు గల మహిళా అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. తమ వెంట బయోడేటా, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని తెలిపారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పర్యటన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చెప్పారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లను డీసీపీ విశాల్‌గున్నీ, ఏబీజీ ఎం.రవీంద్రబాబు, దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, ఇతర ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సీపీ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లతో పాటు వీఎంసీ కార్యాలయం ఎదుట దేవస్థానం ఏర్పాటు చేస్తున్న కేశఖండనశాల షెడ్డు, క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించే భక్తులు వేచి ఉండకుండా త్వరితగతిన ముందుకు సాగేలా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను చేయాలని సూచించారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలిచ్చారు. ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఈ లింగం రమాదేవి, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



- ఆసియా క్రీడల్లో మెరిసిన తెలుగు తేజం జ్యోతి సురేఖ
- కాంపౌండ్ మిక్స్‌డ్, కాంపౌండ్ ఉమెన్ టీమ్‌లో సత్తా
- రెండు స్వర్ణ పతకాలు సాధించిన స్టార్ ఆర్చర్

అంతర్జాతీయ వేదికపై తెలుగు తేజం జ్యోతి సురేఖ మరోసారి మెరిసింది. 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ విభాగంలో రెండు స్వర్ణ పతకాలను సాధించింది. మూడో స్వర్ణంపై గురిపెట్టింది. డబుల్ ధమాకాతో రాణించిన ఈ తెలుగుబిడ్డ వ్యక్తిగత విభాగంలోనూ స్వర్ణ పతకం సాధిస్తుందని ప్రతి ఒక్కరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతి సురేఖ.. డబుల్ ధమాకా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్టానికి చెందిన అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ పోటీల్లో రెండు స్వర్ణాలతో సత్తాచాటింది. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా బుధవారం ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే–జ్యోతి సురేఖ ద్వయం దక్షిణ కొరియాకు చెందిన సో చేవన్–జేహూన్ జూ జోడీపై గెలిచి స్వర్ణ పతకం సాధించింది. గురువారం జరిగిన ఆర్చరీ కాంపౌండ్ ఉమెన్ విభాగంలో జ్యోతి సురేఖ ఫైనల్‌లో విజేతగా నిలిచి స్వర్ణం గెలుచుకుంది. వ్యక్తిగత విభాగంలో శనివారం జరిగే ఫైనల్స్‌కు సురేఖ చేరింది. 19వ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించిన తెలుగు అమ్మాయిగా వన్నెం జ్యోతి సురేఖ రికార్డు సృష్టించింది.

పురస్కారాలు ఎన్నెన్నో...

జ్యోతి సురేఖ ఇప్పటి వరకు ఎన్నో పతకాలు గెలుచుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో 50కు పైగా మెడల్స్‌ను సాధించింది. జాతీయ స్థాయిలో 40 బంగారు, 13 రజతం, 9 కాంస్య పతకాల చొప్పున 62 మెడల్స్ సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో 17 బంగారు, 18 రజత, 15 కాంస్య పతకాలను జ్యోతి సురేఖ దక్కించుకుంది. మరిన్ని పతకాలే లక్ష్యంగా నిత్యం ప్రాక్టీస్ చేస్తోంది.



తల్లిదండ్రులు శ్రీదుర్గ, సురేంద్ర కుమార్‌తో జ్యోతి సురేఖ (ఫైల్)

ప్రతిభకు గుర్తింపు

ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని చాటుతున్న జ్యోతి సురేఖ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి 2022 డిసెంబర్ 19వ తేదీన ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు. అదే రోజు జ్యోతి సురేఖకు గ్రూప్–1 (డెప్యూటీ కలెక్టర్) ఉద్యోగం ఇచ్చి గౌరవించారు. 2017లోనే అర్జున అవార్డు జ్యోతి సురేఖను వరించింది. 2018 సంవత్సరంలో ఇండియన్ అన్‌బాండ్ ఎక్స్‌లెన్సీ అవార్డు, ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో 'సాక్షి' మీడియా యంగ్ అచీవర్ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిభా పురస్కారం, 2018లో జీ టీవీ నుంచి అప్సర అవార్డు, 2014లో అక్కినేని ఫౌండేషన్ క్రీడా రత్న అవార్డును సురేఖ అందుకుంది.

చాలా సంతోషంగా ఉంది

మా జ్యోతి సురేఖ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఆసియా క్రీడా పోటీల్లో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. జ్యోతి సురేఖ ఆ ఒత్తిడిని తట్టుకుని చాలా ఏకాగ్రతతో ఆడుతోందని కోచ్‌లు మెచ్చుకున్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకర్‌గా ఎదగాలని నిత్యం సాధన చేస్తూనే ఉంటుంది. రాష్ట్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయి ఆర్చరీ క్రీడాకారులను తయారు చేసి దేశానికి మరింత పేరు తేవాలనేది జ్యోతి సురేఖ ఆకాంక్ష.

– శ్రీదుర్గ, సురేంద్రకుమార్
(జ్యోతి సురేఖ తల్లిదండ్రులు)

విజయవంతంగా ఆరోగ్య సురక్ష

డీఎంహెచ్ఓ విజయమ్మ



స్వర్ణ(కారంచేడు): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ చెప్పారు. గురువారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ, స్వర్ణ–2 సచివాలయం పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. సచివాలయం పరిధిలో 467 టోకెన్లు మంజూరు చేశామని, సుమారు 450 మందికి వైద్య పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ డీఎంహెచ్ఓకు వివరించారు. శిబిరం నిర్వహణపై డీఎంహెచ్ఓ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు, ఎంపీడీఓ డి.విజయలక్ష్మి, తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం, ప్రత్యేక వైద్యులు శాంతివైష్ణవి, నితిన్, సురేష్ బాబు, భావన్నారాయణ, సాయికృష్ణ, షాలినీ, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసి ఫోరా, శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విప్ అప్పిరెడ్డికి అభినందనలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాసన మండలిలో విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం అభినందించారు. నగరంలో ఓ హోటల్‌లో అప్పిరెడ్డిని గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని రఘురాం ఆకాంక్షించారు. పార్టీలో అంకిత భావంతో పనిచేసేవారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీఓలు, తహసీల్దార్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ గృహ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల పనుల పురోగతిలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు రోజూ జగనన్న లేఅవుట్లలో పర్యటించాలన్నారు. యద్దనపూడి, మార్టూరు గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొల్లూరు, అమృతలూరు మండలాలు వెనుకబడి ఉన్నాయని చెప్పారు. కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, సీపీఓ భరత్ కుమార్, గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఎస్ఈ విద్యాసాగర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో శంకరన్ విగ్రహం

పాలనా వ్యవస్థను ప్రజల వద్దకు పరుగులు పెట్టించిన మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ విగ్రహాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో నెలకొల్పనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. శంకరన్ వర్ధంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరిస్తామని ఆయన వివరించారు. ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమ కరపత్రాలను గురువారం కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, సెర్ప్ కార్యదర్శి సీహెచ్ పార్థసారథి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు పూర్తిచేయాలి

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలు అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ హరి నారాయణ, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్ నాయక్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

బాపట్ల ఎంపీ నందిగం సురేష్

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి గ్రామాల వారీగా ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని, వైద్యశాఖ చరిత్రలోనే ఇది సరికొత్త అధ్యాయమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. గురువారం ఉప్పుమాగులూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిపుణులైన వైద్యులను గ్రామాలకే తీసుకువచ్చి సేవలు అందిస్తున్నారని వివరించారు. శిబిరంలో 316 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 13 మందిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ వైద్యశాలలకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ కృష్ణ, వైద్యాధికారి రమీజ్ అహమ్మద్, వినీల్, భారతి, సౌజన్య, సర్పంచ్ బి.మహాలక్ష్మమ్మ స్థానిక నేత కల్లి అంజనీ ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు టి.నరేష్ పాల్గొన్నారు.



రోగికి మందుల కిట్ అందజేస్తున్న ఎంపీ సురేష్, చైతన్య

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని

- పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 20 వేల ఓపీ సేవలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి రజిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. వైద్య కళాశాలల నిర్మాణం, నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రుల ఆధునికీకరణ చేపడుతోందని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం ద్వారా అందరికీ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పల్నాడు జిల్లాలో 385 వైద్య శిబిరాలు నిర్వహించబోతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలో 72 వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. జిల్లాలో 20వేల ఓపీ సేవలు ఇప్పటి వరకూ నమోదు కాగా.. నాణ్యమైన వైద్యం కోసం 510 మందిని పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని తెలిపారు. 139 మంది స్పెషలిస్టు వైద్యులు సురక్ష వైద్య శిబిరాల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో 39 వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని, ఇప్పటివరకూ 8 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 1,637 ఓపీ సేవలు నమోదు కాగా వీరిలో 56 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ

11 కిలోల వెండి ఆభరణాలు మాయం

జే.పంగులూరు: వేంకటేశ్వర ఆలయంలో దొంగలు పడి స్వామి వెండి ఆభరణాలు అపహరించుకు పోయారు. ఈ ఘటన మండల పరిధిలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం ఉదయం పూజారులు ఆలయం వద్దకు వచ్చి తలుపులు తీయబోగా, అప్పటికే తలుపులు పగులగొట్టి ఆలయంలో స్వామి వారికి అలకరించిన వెండి ఆభరణాలు పోవడాన్ని గమనించి స్థానికులు తెలియజేశారు. వచ్చి చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వామివారి వెండి కిరీటం, పాదాలు, వక్షస్థలం, నాగాభరణాలు, చక్రాభరణం, వడ్డాణం, ఉత్సవ విగ్రహాల కిరీటాలు, వెండి శఠారి పళ్లెం, కుంబ హారతి, ఏకహారతి, భుజ కీర్తులు, కంఠాభరణాలు, హృదయ లక్ష్మి చోరీకి గురైనట్లు స్థానికులు తెలియజేశారు. ఆభరణాలు అన్ని 11 కిలోల వరకు ఉంటాయని, వీటి విలువ సుమారు రూ. 7 లక్షలు వరకు ఉంటుదని తెలిపారు. 2018లో 50 కిలోల కంచుగంట చోరీకి గురైందని ఇప్పటికి దాని ఆచూకీ తెలియలేదని వెల్లడించారు.



కొప్పెరపాడులో వేంకటేశ్వరస్వామి దేవాలయం



ఆభరణాలతో స్వామి వారు (ఫైల్)



చోరీకి గురైన అనంతరం స్వామి వారి విగ్రహం

మండలానికి రూ.60 లక్షల నిధులు

గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వం అంతే స్థాయిలో పెద్దఎత్తున పనులు చేపట్టి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. గతంలో ఇచ్చిన మాటమేరకు తాజాగా మండలానికి రూ.60 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే శాసనసభ్యుల ద్వారా చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకున్న అధికారులు సదరు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులను మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

గణేశ్ నిమజ్జనంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్

తాడేపల్లి రూరల్ : ఉండవల్లిలో గురువారం రాత్రి గణేశుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా 108 కేజీల లడ్డూ వేలంపాట నిర్వహించారు. కుంచనపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆరుమళ్ల చంద్రశేఖరరెడ్డి రూ.9 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు. ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. గణేశుని నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జన వాహనాన్ని ఆయనే స్వయంగా ముందుకు నడిపారు. తర్వాత విగ్రహదాత తమ్మా సుబ్బారెడ్డి, గంటు బాలాజీరెడ్డి, కళ్లం సాంబిరెడ్డి, గణేష్ యూత్ సభ్యులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని సన్మానించారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లాలో బుధవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 357 మంది పై కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరాలకు మూల కారణం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడమే అన్నారు. పోలీసు అధికారులు ప్రతి రోజూ నిర్మానుష్యమైన ప్రదేశాల్లో, కల్వర్టులు నిరుపయోగంగా ఉన్న ప్రదేశాల్లో, శ్మశానవాటికల వద్ద గస్తీ నిర్వహించాలన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

రేపల్లె రూరల్: యువకుడి హత్యకేసులో నిందితుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పట్టణ సీఐ నజీర్‌బేగ్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. 23వ వార్డుకు చెందిన మేకా సాయికుమార్‌ను పాతకక్షల నేపథ్యంలో బందెల రాకేష్ అలియాస్ హర్ష హత్య చేశాడని చెప్పారు. ఈనెల 3వ తేదీన అరవపల్లి రోడ్డు లోని శ్మశాన వాటికలో ఇరువురు మద్యం సేవిస్తున్న సమయంలో హర్ష బీరు బాటిల్‌తో సాయికుమార్ తలపై కొట్టటంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా గురువారం పెనుమూడి చెక్‌పోస్ట్ సమీపంలో నిందితుడు హర్షను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవటంతో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ నవీన్, కానిస్టేబుల్ సోమశేఖర్, నాగరాజు, మొగదారయ్యలను అభినందించారు.

పేదలకు ఆరోగ్య భరోసా జేఏఎస్

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పరిశీలించిన ఎమ్మెల్సీ సునీత

చీరాల/వేటపాలెం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. గురువారం చీరాల పట్టణంలోని 32వ వార్డులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్యాంపునకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్నారన్నారు. అన్ని రకాల వైద్యసేవలు అందరికి అందుబాటులో తెచ్చేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అక్కడి సిబ్బంది మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంలోని జగనన్న ఆరోగ్య రక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ సందర్శించి రోగులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం పల్లెల్లో వైద్య విప్లవం తెచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ అశోక్‌వర్ధన్, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, పులి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, గవిని మురళి, గవిని రమేష్, బొమ్మిడి నాగరాజు, పులి తిరుపతిరావు, పులి వెంకట్రావు, గడ్డం చంద్రరావు పాల్గొన్నారు.



చీరాలలో జేఏఎస్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ సునీత

పేద ప్రజల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: పేద ప్రజల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు, ఈ బృహత్తర కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ శాస్త్రి స్కూల్ ఆవరణలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీ మోపిదేవి ప్రారంభించి వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో క్లీనిక్స్ ఏర్పాటు చేసి అందులో సిబ్బంది కొరత లేకుండా పూర్తిస్థాయిలో నియమించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో కూడా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వైద్య సిబ్బంది ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా సిబ్బంది మీ ఇళ్లకే వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారని, ఇది దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేదన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కిట్లను పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

అనంతరం వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుని రోగులకు జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరం ప్రాంగణంలోనే డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆర్గానిక్ వంటలను తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, స్థానిక సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీ నాగుల నరసింహారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, నాయకులు బండారు రామారావు, కామినేని కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ మురళి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పసికందు అపహరణలో నిందితులు అరెస్టు

పట్నంబజారు: పసికందును అపహరించిన కేసులో ఇద్దరు మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నగరంలోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీకి చెందిన షేక్ రోష్ని గత నెల 26వ తేదీన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఈక్రమంలో ఆసుపత్రిలోని 106 వార్డులో వైద్యం నిమిత్తం ఉండగా, ఈనెల 3వ తేదీన రోష్ని నిద్రిస్తున్న సమయంలో నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన కంభాల లక్ష్మి అనే మహిళ ఎనిమిది రోజుల పసికందును అపహరించుకు పోయింది. ఎవరికి అనుమానం రాకుండా తన తోపాటు తెచ్చుకున్న సంచిలో చిన్నారిని పెట్టుకొని జీజీహెచ్ వద్ద ఆటో ఎక్కి పల్నాడు బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడి నుంచి బస్సులో నరసరావుపేట చేరుకుని తన స్వగ్రామానికి వెళ్లింది. సీసీ ఫుటేజీ ఆధారంగా బాలికను ఎత్తుకెళ్లిన కంభాల లక్ష్మిని గుర్తించి పట్టుకొని విచారించగా తాను తీసుకొచ్చిన చిన్నారని అబ్బూరి వెంకటేశ్వరమ్మకు అప్పగించినట్లు తెలిపింది. అనంతరం పోలీసులు వెళ్లి వెంకటేశ్వరమ్మ ఇంట్లో ఉన్న చిన్నారిని సురక్షితంగా తీసుకుని గుంటూరు వచ్చారు. ఈక్రమంలో లక్ష్మిని విచారించగా, ఆమెకు అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చేందుకు తన బంధువు అయిన వెంకటేశ్వరమ్మకు పిల్లలు లేని క్రమంలో చిన్నారిని ఇస్తే డబ్బులు ఇస్తుందనే కారణంతో ఎవరికి తెలియకుండా పసికందును అపహరించినట్లు తెలిపింది. దీంతోపాటు చిన్నారిని అపహరించేందుకు సహకరించిన వెంకటేశ్వరమ్మను కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చిన ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఎస్సై ఆంథోని, ఉమెన్ ఏఎస్సై కుమారి, హెడ్‌కానిస్టేబుల్‌లు ఎల్.రవి, వీరభద్రం, కానిస్టేబుల్ శ్రీక్రాంత్, ఉమెన్ సీసీలను జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ అభినందించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో గురువారం రాత్రి వెలుగు చూసింది. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన జాన్‌వలి మద్యానికి బానిసై అప్పులు చేశాడు. దీంతో అప్పుల విషయం ఇంట్లో తెలుస్తుందని మనస్తాపంతో బుధవారం ఉదయం వలపర్ల గ్రామ పరిధిలోని పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బంధువులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జాన్‌వలి పరిస్థితి విషమించి మృతి చెందాడు. గురువారం జాన్ వలి భార్య జైతున్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే కమలాకర్ తెలిపారు.

ఖాతాదారుల సేవలే ఏపీజీబీ ప్రథమ లక్ష్యం

బల్లికురవలో బ్రాంచ్‌ను ప్రారంభించిన ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పలు పథకాలు, సేవలు సకాలంలో లబ్ధిదారులకు అందించటమే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ధ్యేయమని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. గురువారం బల్లికురవలో ఆధునిక వసతులతో నూతన భవనంలోకి బ్రాంచ్ మార్పులో భాగంగా చైర్మన్ బ్రాంచ్‌ని కౌంటర్‌ను, లాకర్‌ను, ఏటీఎంను ప్రారంభించారు. కడప రీజియన్‌లో కడప, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఆరు దశాబ్దాలుగా బ్రాంచ్‌ల ఏర్పాటుతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 శాఖలు, 51 బిజినెస్ కరస్పాండెంట్‌ల ద్వారా వాణిజ్య బ్యాంకులతో సమానంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. పంట, బంగారు రుణాలతోపాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు వాహనాల కొనుగోలుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై కూడా అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఇంటి నుంచి ఇంటర్‌నెట్ ద్వారా మొబైల్ బ్యాంకింగ్ యూపీఐ సేవలు అందిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన వ్యక్తులు అందరు తమ బ్యాంకులో ఖాతాలు ప్రారంభించుకుని లావాదేవిలు కొనసాగించుకోవాలని చైర్మన్ కోరారు. ప్రారంభ కార్యక్రమంలో ఆర్ఎం హేమలత, మేనేజర్ బీ.సుకుమార్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



బల్లికురవ ఏపీజీబీ భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాకేష్ కశ్యప్

8న తెనాలిలో జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

తెనాలి: జిల్లా సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ఈనెల 8వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు విక్రయం

- నిత్యావసరాల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఆ పత్రిక కథనంలో వాస్తవం లేదు

నరసరావుపేట: జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు విక్రయాలు చేస్తూ నిత్యావసర ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఎస్. పద్మశ్రీ పేర్కొన్నారు. గురువారం ఒక దినపత్రిక(సాక్షికాదు)లో అస్తవ్యస్తంగా రేషన్ సరఫరా అంటూ ప్రచురితమైన కథనాన్ని ఆమె ఖండించారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ గత జూలై నెల నుంచి దేశవాళీ కందిపప్పు కేజీ రూ.135, ఆఫ్రికన్ వెరైటీ కందిపప్పు రూ.120 చొప్పున ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకు ప్రజలకు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా మాచర్ల, దుర్గి, కారంపూడిలలో దేశవాళీ కందిపప్పు రూ.120లకే లబ్ధిదారులకు అందజేయటం జరిగిందన్నారు. ఇప్పటివరకు 11,492మంది కార్డుదారులకు 181.13క్వింటాళ్ల కందిపప్పు తక్కువ ధరలకు అందించామన్నారు.

ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు అరికట్టవచ్చని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు తెలిపారు. వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ద్విచక్రవాహనాల దొంగతనానికి సంబంధించి నరసరావుపేట పట్టణానికి చెందిన పసుమర్తి సంతోష్, సిక ఉదయ్‌కుమార్‌లు చెడు వ్యసనాలకు బానిసలై ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.16లక్షల విలువ చేసే 32 మోటారు సైకిళ్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐ సాంబశివరావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు

కృష్ణాపై ప్రకాశం జిల్లా జట్టు విజయం

నరసరావుపేట: స్థానిక ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల బాలుర మూడు రోజుల టెస్ట్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 163 పరుగుల భారీ తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. మూడురోజుల నుంచి కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరుగుతున్న విషయం విదితమే. నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ తొమ్మిది వికెట్ల నష్టానికి 187పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు 189 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం తమ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు ఆటగాళ్లు 152 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. కృష్ణా జిల్లా జట్టులోని విశాల్ మాత్రమే పోరాడి 58 పరుగులు చేశారు. ప్రకాశం జిల్లా జట్టులోని పాశం నవీన్ ఐదు వికెట్లు సాధించగా, చిన్నారావు, దుర్గా బాలాజీలకు చెరో రెండు వికెట్లు లభించాయి. ఈనెల ఏడవ తేదీ నుంచి ప్రకాశం, గుంటూరు జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు వెల్లడించారు.



ఐదు వికెట్లు సాధించిన పాశం నవీన్

టీడీపీ నేత బండారు సత్యనారాయణ చిత్రపటాలు దహనం

పట్నంబజారు: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ అసభ్యకర పదజాలంతో తీవ్రంగా వ్యాఖ్యలు చేయడంపై మహిళా లోకం కన్నెర్ర జేసింది. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ ఆధ్వర్యంలో బండారు సత్యనారాయణ వ్యాఖ్యల్ని నిరసిస్తూ ఆయన చిత్రపటాల్ని చెప్పులతో కొట్టి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ మంత్రి రోజాపై చేసిన వ్యాఖ్యల్ని సత్యనారాయణ బేషరతుగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక పచ్చపార్టీ నేతలు పిచ్చిపట్టిన కుక్కల్లా మొరుగుతున్నారని మండి పడ్డారు. బండారు సత్యనారాయణ వ్యాఖ్యల్ని వెనక్కు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఈపూరి వనజాక్షి, పిల్లి మేరి, కార్పొరేటర్ ఎ.పద్మావతి, ఉడుముల లక్ష్మి, నిమ్మరాజు శారద, స్వర్ణలత, రత్నకుమారి, శివపార్వతి, వెంకాయమ్మ, షేక్ ఖైరూన్, శిరీష, కవిత పాల్గొన్నారు.



చిత్రపటాలను దహనం చేస్తున్న మహిళా విభాగం నేతలు

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, పథకాలకు ఆకర్షితులై టీడీపీకి చెందిన పలువు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గొట్టిపాళ్లకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాల వారు టీడీపీని వీడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న, అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడుతున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాలలో సంతోషాలు నింపారన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎంతో సేవ చేశామని, అయినప్పటికీ సరైన గుర్తింపు లేకపోవటంతో సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఇప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్ జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రి చేసేంత వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ రూప్లీ బాలునాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పోలకం వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడబోయిన ఇన్నయ్య, మోరబోయిన అచ్చయ్య, చింతా ఆదినారాయణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకు వేధింపులు తాళలేక మహిళ మృతి

న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

పొన్నూరు: ప్రైవేటు బ్యాంకు వేధింపులతో మనస్తాపానికి గురై గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గతేడాది చింతలపూడికి చెందిన పి. మరియమ్మ తన ఇల్లు తాకట్టు పెట్టి ఓ ప్రైవేటు బ్యాంకులో లోన్ తీసుకుంది. ఆమె నిరక్షరాస్యురాలు కావటంతో లోన్ మూడు లక్షలకుగాను రూ. 18 లక్షలు బ్యాంకు సిబ్బంది ఆమె ఖాతాలో జమ చేసి, పొరపాటున పడిందంటూ రూ.15 లక్షలు రిటర్న్ తీసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఆమె తీసుకున్న మొత్తం రూ.18 లక్షలంటూ, వడ్డీతో కలిపి రూ.22 లక్షలకు నోటీసు వచ్చింది. విషయాన్ని తెలుసుకున్న ఆమె దిగ్భ్రాంతికి గురై గుండెపోటుతో మరణించినట్లు తెలిసింది. ఆమె మృతికి కారణమైన బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ కుటుంబసభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. జీబీసీ రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ పోలీసులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చీరాల: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం చీరాల మండల పరిధిలోని హౌసింగ్ కాలనీలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సంక శిరీషకు హేమంత్‌కుమార్‌తో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి పదేళ్ల బాబు ఉన్నాడు. అయితే కొంతకాలంగా భర్త అతని తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. వేధింపులు తాళలేక గురువారం ఇంటిలో పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

మహిళా వలంటీర్ పట్ల అసభ్య ప్రవర్తన

దాచేపల్లి: మహిళా వలంటీర్ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రశ్నించిన ఆమె కుటుంబ సభ్యులపై ఆ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గోసు దుర్గా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె ఇంటి ఎదురుగా షేక్ జానీబాషా నివసిస్తున్నాడు. పలుమార్లు వలంటీర్ పట్ల జానీబాషా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయాన్ని వలంటీర్ దుర్గా కుటుంబ సభ్యులకు చెప్పింది. ప్రశ్నించేందుకు వెళ్లిన వలంటీర్ తల్లి ఈశ్వరమ్మతో పాటుగా మరో ముగ్గురిపై జానీబాషా కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయాలు కావటంతో రక్తస్రావమైంది. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన జానీబాషాను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దాసరి శివనాగరాజు చెప్పారు.